మెర్గేనూ, అతని మిత్రులూ

నానాయ్ జానపద కథ





అనగా అనగా ఒక వేటగాడు వుండేవాడు. సైబీరియాలో ఒక కొండవాగువద్ద ఒక గ్రామంలో అతను నివసించేవాడు. అతని పేరు మెర్గేన్. అతను ధైర్యవంతుడు, మంచి వేటగాడు. అతని వంటయింట్లో చేపలకూ, మాంసానికీ యెప్పుడూ కొరత వుండేది కాదు. కానీ అతను తన అవసరాలకు మించి జంతువులను చంపేవాడు కాదు.


ఒకనాడు అతను వేటాడుతూ వేటాడుతూ అమూర్ మహానదిదాకా పోయినాడు. అతనికి వేట జంతువు లేవీ కనిపించ నందున దట్టమైన సైబీరియా అడవిలోపలికి పోయినాడు. భయంకరమైన ముసలి, పులి ఆ అడవికి రాజు.

అతను ఫర్ చెట్లగుండా, పైన్ చెట్లగుండా సందుచేసుకొని పోతూవుండగా, బురద గుంతలో చిక్కుకున్న దుప్పి ఒకటి అతనికి హఠాత్తుగా కనిపించింది. మెర్గేన్ దానిమీదికి బాణం వదలబోయేటప్పటికి, అది దయనీయంగా యిలా అరిచింది:

"మెర్గేన్, నన్ను రక్షించు. యీ బురదలోనుండి నన్ను వెలికితీయ్."

వేటగాడు దుప్పిమీద జాలి తలచి, దానిని బురద గుంతలోనుండి వెలికి లాగినాడు. అది బురద విదలించుకొని, అతనితో యిలా చెప్పింది:

"మెర్గేన్, నాతో యెప్పుడు అవసరం వచ్చినా నన్ను పిలువు."





ఆ మాట చెప్పి దుప్పి అడవిలోకి పరుగెత్తిపోయింది. మెర్గేన్ అడవిలో ముందుకు సాగినాడు, చుట్టూ జాగ్రత్తగా చూసుకుంటూ. కాసేపటికి అతనికి ఒక చీమ కన్పించింది. అది కిందపడిన చెట్టుకొమ్మకింద యిరుక్కుంది పాపం.

"మెర్గేన్, దయయుంచి నన్ను రక్షించు," అని చీమ ప్రార్థించింది.

చీమమీద జాలితో అతను కొమ్మ యెత్తి, దానిని విడిపించినాడు.



"నీకు కృతజ్ఞురాలిని మెర్గేన్. నాతో అవసర మున్నప్పుడు నన్ను పిలువు."

మెర్గేన్ అమూర్ ఒడ్డువెంబడి నడుస్తూ నడుస్తూ, లోతులేని ఒక కొలను చేరినాడు. అక్కడ విశ్రమించాలని అతను అనుకున్నాడు. కానీ, అతను అమ్ముల పొది తీసి కింద పెడుతూ వుండగా, ఒక గద్గద కంఠం వినిపించింది:

"మెర్గేన్, నన్ను రక్షించు. నేను చచ్చిపోతున్నాను. మూడు రోజులుగా యిక్కడ పడివున్నాను."



మెర్గేన్ తలయెత్తి చూసినాడు. ఒడ్డున గొప్ప చేప ఒకటి కదలలేకుండా పడి వుండింది.

అతను చేప శరీరానికి తన భుజం ఆనించి, దానిని మెల్లమెల్లగా నదిలోకి తోసినాడు. తన కడుపుకింద లోతు నీళ్ల తగిలిన వెంటనే చేప గట్టిగా తోక జాడించి చల్లని నది లోతుల్లోకి మునక వేసింది. మెర్గేన్ విశ్రమించడానికి ఒక రాతిమీద కూర్చుంటూ వుండగా, నీళ్లలోనుండి చేప తల నిక్కబెట్టి యిలా చెప్పింది:

“నీ దయకు కృతజ్ఞురాలిని మెర్గేన్. నీకు నా సాయం యెప్పుడైనా అవసరమైతే, నన్ను పిలువు.”




విశ్రాంతి తీసుకున్న తర్వాత వేటగాడు మళ్ళీ బయలుదేరినాడు. కొంతసేపటికి అతని కొక కొత్త గ్రామం కనిపించింది. అందమైన పెద్ద గుడిసెలోనుండి జిత్తులమారి చూపులు గల ఒక లావు ముసలివాడు బయటికి వచ్చినాడు.

"యెవరు నీవు?" అని ముసలివాడు ప్రీతిగా అడిగినాడు.

"నేనొక వేటగాణ్ని. అడవిలో తిరుగుతూ తిరుగుతూ వుండగా మీ వూరు కనిపించింది. నీతో కలిసి కాసేపు విశ్రమించ వచ్చు ననుకున్నాను," అని మెర్గేన్ జవాబు చెప్పినాడు.

"అలాగే. లోపలికి వచ్చి, నా ఆతిథ్యం స్వీకరించు," అని ముసలివాడు ఆహ్వానించినాడు.





మెర్గేన్ తన కన్నుల తనివిదీర గుడిసె అందం చూస్తూ వుండినాడు. యింతలో అతనికి చెవుల లోలకుల కలనాదం వినిపించింది. వాకిట్లో మనోహరమైన ఒక పడుచు కనిపించింది. ఆమె ముఖం సంతోషంతో వికసించింది, కన్నులు మిలమిలలాడుతూ వుండినాయి, కారునలుపు జడ దాదాపు పాదాల దాకా (వేలాడుతూ వుండింది.

"మా అమ్మాయి యెలా వుంది?" అని ముసలివాడు అడిగినాడు.

"నేను అమూర్ తీరంలో చాలామంది అందగత్తెలను చూసినాను. కానీ యింత అందగత్తె నెప్పుడూ చూడలేదు," అని మెర్గేన్ ఒప్పుకున్నాడు. "యీామెను నాకిచ్చి పెండ్లిచెయ్యి. నీకు మంచి బహుమతి యిస్తాను."

"అది కుదరదు మెర్గేన్," అని జిత్తులమారి ముసలివాడు అన్నాడు. "ధీరులైన వేటగాళ్లు వందమంది యీామెను కోరినారు. వాళ్లందరూ యిప్పుడు నా బానిసలుగా వున్నారు. నేను నీకు మూడు పనులు అప్పగిస్తాను. వాటిని పూర్తిచేస్తే నీవు నా అల్లుని వౌతావు, లేకపోతే నా బానిస వౌతావు. ఆలోచించుకో."

క్షణం కూడా ఆలోచించకుండా, "ఒప్పుకున్నాను," అని మెర్గేన్ అన్నాడు.



''సేవకులారా, నా యినప బూట్లు తెండి,'' అని ముసలివాడు కేకవేసినాడు.

కాసేపటికి సేవకులు వచ్చినారు, బరువైన బూట్లను యీడ్చుకుంటూ.

''యీ యినప బూట్లు తీసుకో. ఒక్క రాత్రిలో వీటిని నీవు అరగదీస్తే, అప్పుడు రెండవ పని చెప్తాను,'' అని ముసలివాడు చెప్పినాడు.

మెర్గెన్ బూట్లు తీసుకొని అడవిలోకి పోయినాడు. ''యిలాంటి బూట్లను అరగదీయడానికి నేను వంద జన్మ లెత్తాలి,'' అని అతను విచారపడినాడు. హఠాత్తుగా అతనికి దుప్పి జ్ఞాపకం వచ్చింది.

''మిత్రమా, దుప్పీ, నాకు సాయం చెయ్యి,'' అని అతను కేక వేసినాడు.



ఆ కేక ప్రతిధ్వని అణగిపోకముందే, దుప్పి అతనిముందు నిలబడివుంది. మెర్గేన్ తన దురదృష్టం వివరించినాడు. మరుమాట లేకుండా దుప్పి ఆ బూట్లు తన ముందరి కాళ్లకు తగిలించుకొని, కొండలలోకి దౌడుతీసింది. దాని వెనుక మిణుగురులు లేచినాయి, రాత్రిపూట ఆకాశంలో నక్షత్రాల లాగ. మెర్గేన్ గడ్డిమీద పండుకొని నిద్రపోయినాడు. ప్రొద్దున అతను లేచేటప్పటికే దుప్పి అక్కడ వుంది: సరికొత్త యినప బూట్లలో మిగిలిందల్లా పేలికలైన పై భాగం.

మెర్గేన్ ఆనందంతో దుప్పిని కౌగలించుకొని, ముద్దుపెట్టుకున్నాడు. తరువాత బూట్ల పేలికలు తీసుకొని వేగంగా ముసలివాని గుడిసె వద్దకు పోయి, దబదబా తలుపు బాదినాడు. ముసలివాడు బయటికి వచ్చినాడు.



బూట్ల పేలికలు ముసలివాని ముందర విసరికొట్టి, మెర్గేన్ యిలా అన్నాడు:

''రెండవ పని చెప్పు.''

ఒక క్షణంపాటు ముసలివానికి నోట మాట రాలేదు. ఆశ్చర్యంనుండి తేరుకొని అతను కేకవేసినాడు:

''సేవకులారా, అయిదు బస్తాల రాగులు తెండి!''

ముసలివాడు బస్తాలు నేలమీద కుమ్మరించినాడు, రాగులు వూరంతా దిక్కుదిక్కులా చెదరిపడేటట్లు. అప్పు డతను చిరునవ్వుతో యిలా అన్నాడు:



"యిక రాగులన్నీ ప్రోగుచెయ్యి; ఒక్క గింజ కూడా వదలిపెట్టకుండా. నీకు వ్యవధి ఒక్క రోజు."

మెర్గేన్ పచ్చిక బయలులోకి పోయి, నేలమీద పండుకొని, కేకవేసినాడు:

"మిత్రమా, చీమా, నాకు సాయంరా!"

వెంటనే చీమ ప్రత్యక్షమై, వేటగాని కథ వినింది. చీమ తన సోదరులను పిలిపించింది. కాసేపట్లో గ్రామంలోని నేల అంతా చీమలతో నిండిపోయింది, కాలు మోపడానికి సందు లేకుండా. అన్నం తినేటంత సేపటిలో రాగులన్నీ బస్తాలలో చేరినాయి.



మెర్గేన్ చీమలకు కృతజ్ఞత తెలిపి, ముసలివాని వద్దకు పోయినాడు. ముసలివానికి యింకా ఆశ్చర్య మైంది. అతను తల గోక్కుంటూ, యిలా అన్నాడు:

"కడపటి పని చెప్తాను. యిది నెరవేరిస్తే, నా కూతురు నీ దొరుకుతుంది. చాలా కాలం కిందట మా నాన్న చిన్నప్పుడు అమూర్ నదిలో బంగారు ఉంగరం పోగొట్టుకున్నాడు. సాయంత్రం లోపల అది తెచ్చిపెట్టు."



మరొకసారి మెర్గేన్ దిగులుతో గుడిసెనుండి వచ్చినాడు. కానీ కిటికీలోనుండి తెల్లని చేతిగుడ్డ వూపుతున్న పడుచును చూసి అతను ధైర్యం తెచ్చుకొని, గబగబా నది వొడ్డుకు నడిచినాడు.

"చేపరాజా, నాకు సాయంరా!"



మూడుసార్లు అతను కేక వేసేటప్పటికీ అమూర్ నదిలో బుడగలు బయలుదేరినాయి, చేపరాజు గొప్ప తల నీళ్లలోనుండి నిక్కబొడుచుకుంది. మెర్గేన్ తన బాధలన్నీ దానిముందర వెళ్లబోసుకున్నాడు.

బదులు మాట లేకుండా చేప నదీగర్భంలోకి వెళ్లి అమూర్ నదీ నివాసుల నందరినీ పిలిపించింది. చేపలు చిన్నవీ, పెద్దవీ నదీగర్భమంతా గాలించినాయి, ఉంగరం దొరికింది.



వేటగాడు ఆనందంతో బంగారు ఉంగరం తీసుకొని ముసలివాని వద్దకు పోయినాడు. ముసలివాడు అది తీసుకొని గుడిసెలో పలికి పోయినాడు. కాసేపటికి అతను వెలికి వచ్చినాడు, చిరునవ్వు లొలికే కూతురును వెంటబెట్టుకొని:

"ధైర్య సాహసాల వేటగాడా, యిదుగో నా కూతురు. నీ భార్యగా స్వీకరించు. నీకు యిష్టమైతే, నన్నూ, నా బానిసలనూ, నా సేవకులనూ, మొత్తం నా గ్రామాన్నీ కూడా తీసుకో. అన్నీ నీవే."



మెర్గేన్ జవాబిచ్చినాడు:

"సరే. కానీ, యీనాటినుండి బానిసలూ వుండరు, సేవకులూ వుండరు. అందరమూ సోదరులలాగా, శాంతంగా వుందాము."

అప్పటినుండి వాళ్ళ ఆనందంగా సంతృప్తితో జీవిస్తూవుండినారు. అమూర్ వొడ్డున వున్న గ్రామంలోని వేటగాళ్లను అదృష్టం యెప్పుడూ వదలిపెట్టలేదు.



అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి

МЭРГЕН И ЕГО ДРУЗЬЯ
Нанайская сказка

На языке телугу

MERGEN AND HIS FRIENDS
A Nanai Folk Tale

In Telugu

"రాదుగ" ప్రచురణాలయం. మాస్కో

ISBN 5-05-000342-3